# విశ్వజ్ఞానయజ్ఞం – 2021

# మహాత్ములు నేటి తరానికి మార్గదర్శకులు

## పదకవితాయోగి - శ్రీ అన్నమాచార్య రెండవ రోజు (6/20/2021)




శివాయ గురవే నమః

శ్రీమాత్రేనమః

శ్రీవిష్ణురూపాయనమఃశివాయ

శ్రీవేంకటేశాయ శ్రీనివాసాయ గోవిందాయ నమోనమః

నిన్నటి స్మరణ: పదకవితాయోగి అనే దృష్టితో పరిశీలిస్తున్నాము అన్నమాచార్య కీర్తనలని, వేంకటేశ్వర వైభవాన్ని! ***ఆర్జవ శక్తి/ సారళ్యం = మనస్సు, మాట, క్రియ ఒకటి అయితే ఆర్జవశక్తి! ఈ మూడూ ఉంటే రచనకి శక్తి వస్తుంది, కలకాలం ఉండిపోతుంది! అదే అన్నమాచార్య కీర్తనలలో కనపడుతున్నది!***

స్వామిదర్శనం:

1. పొడగంటిమయ్యా ..... భావింప కైవసమైన పారిజాతమా

**పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము**
**నెడయకవయ్య కోనేటి రాయడా**

**కోరిమమ్ము నేలినట్టి కులదైవమా, చాల**
**నేరిచి పెద్దలిచ్చిన నిధానమా**
**గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు**
**చేరువజిత్తములోని శ్రీనివాసుడా**

**భావింప గైవసమైన పారిజాతమా, మమ్ము**
**చేవదేర గాచినట్టి చింతామణీ**
**కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము**
**తావై రక్షించేటి ధరణీధరా**

**చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా**
**లడచి రక్షించే దివ్యౌషధమా**
**బడిబాయక తిరిగే ప్రాణబంధుడా, మమ్ము**
**గడియించినట్టి శ్రీ వేంకటనాథుడా**

- పారిజాతము, చింతామణి, కామధేనువు ఏవయినా ఇస్తాయిట, కానీ ఆ మూడూ నాకు నువ్వే అంటున్నారు స్వామితో! చేతికి అందిన పారిజాతానివి, చేవదేర గాచే చింతామణివి!

భక్తుడు చూసిన దేవుడు మరింత అందంగా ఉంటాడు!

2. వాడేవో కంటిరటరె....

**వాడివో కంటిరటరే వన్నెల వాడు**
**పైడి మూలము కటారు పరుజుల వాడు**

**పెద్ద కిరీటమువాడు పీతాంబరము వాడు**

ఒద్దిక కౌస్తుభమణి ఉరము వాడు

ముద్దుల మొగమువాడు ముత్తేలనామమువాడు

అద్దిగో శంఖు చక్రాల హస్తాల వాడు

అందిన కటిహస్తము అభయహస్తము వాడు

అందెల గజ్జెల పాదాలమరువాడు

కుందణపు ఈ మకరకుండలంబు వాడు

కందువ బాహుపురుల కడియాల వాడు

నగవు చూపులవాడు నాభి కమలము వాడు

మొగపుల మొల నూళ్ల మొలవాడు

చిగురు మోవి వాడు శ్రీవేంకటేశుడు

తగునలమేల్మంగ తాళిమెడ వాడు

- ఆకేశపాదాంతం వర్ణించే కీర్తన! చరణాల్లో కిరీటం నుండి చూపిస్తున్నారు!
- తాళిమెడ వాడు అంటూ కల్యాణవెంకటేశ్వర స్వామిని చెప్తున్నారు.

<u>విరాడ్రూపుడు వేంకటేశ్వరుడు</u>

3. ఆ రూపమునకే హరి నేను మ్రొక్కెదను

ఆ రూపమునకే హరి నేను మొక్కెదను

చేరి బిభీషణుని శరణాగతుడని చేకొని సరిగాచితివి

ఫాలలోచనుడు బ్రహ్మయు నింద్రుడు

నోలి నగ్నియును సూర్యచంద్రులును

నీలోనుండగ నెరి గనె కిరీటి

మూల భూతివగు మూర్తివి గాన

అనంత శిరసుల ననంతపదముల

ననంతనయనము లనంతకరముల

ఘన నీరూపము కనుగొనె కిరీటి
అనంతమూరితి వన్నిట గాన

జగములిన్నియును సకల మునీంద్రులు
నగు శ్రీవేంకటనాథుడ నిన్నే
పొగడగ కిరీటి పొడగనె నీరూపు
అగణిత మహిముడ వన్నిట గాన

- అర్జునుడు చూసినది ఈ రూపాన్నే! భగవద్గీతలో దర్శనం ఇచ్చిన విశ్వరూపం! పల్లవిలో విభీషణుడు శరణు వేడితే రక్షించే ఘట్టం చెప్తున్నారు. ఎందుకంటే "సర్వధర్మాన్" శ్లోకం స్ఫూరింప చేస్తున్నారు "సక్రుదేవ ప్రపన్నాయ" అని రాములవారు అన్న మాటని సమన్వయిస్తున్నారు. అభయం ఇచ్చిన ఆ మూర్తే విశ్వరూపుడు!
- శివుడు బ్రహ్మ ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు అన్నీ నీలోనే చూసాడు కిరీటి! ఎందుకంటే నువ్వు **మూలభూతివి కదా స్వామి!**
- అనంతత్త్వం దర్శింప చేసారు - అనంత పదములు, శిరస్సులు, నయనములతో కనుగొన్నాడు కిరీటి, **అనంతమూర్తివి నువ్వు**
- ఆ విశ్వరూపాన్ని ఎందరో నమస్కరిస్తున్నాను! సర్వ దేవతలు నిన్ను నమస్కరిస్తున్నాను, నిన్ను చూసాక నమస్కరించకుండా ఎవరు ఉండగలరు? నీ రూపాన్ని వారందరూ పొగడుతూ ఉండగా కిరీటి చూసాడు, **అగణితమహిముడవు కావున!**

**కళ్యాణవేంకటేశ్వరుడు - అన్నమయ్య కీర్తనల్లో**

నిత్యకళ్యాణము ఏర్పాటు చేసినదే అన్నమాచార్యులవారు!

అన్నమయ్య కొడుకు పెద్దతిరుమలాచార్యులవారు కూడా పెద్ద కవి! కొన్ని సార్లు ఆయన కీర్తనలని అన్నమాచార్యులవారివే అనుకుంటారు కూడా!

ఈయన అన్నమాచార్యని కీర్తిస్తారు అనేక విధాలుగా!

"హరి అవతరమితాడు అన్నమయ్య"

"అప్పని వరప్రసాది"

" దినము ద్వాదశి నేడు"

అన్నమయ్య దౌహిత్రుడు అనగా కూతురి కొడుకు, రేవణూరి వెంకటార్యుడు ఆయన కూడా రెండు ప్రబంధాలు రచించారు

1) శకుంతలపరిణయం 2) శ్రీపాదరేణు మహాత్మ్యం

వేంకటేశ్వర స్వామి మా మాతామహుడకు అన్నమాచార్యకు అల్లుడనిపించుకున్నారు అంటారు!

అన్నమాచార్య కీర్తనలు విన్న నా చెవితో మరొకటి వినను అన్నారుట స్వామి అన్నమాచార్యతో! దీని అర్థం ఏమిటి అంటే అన్నమయ్య అంత మధురంగా ఎవరు రచించగలరు?

అన్నమాచార్య సుష్టుగా విశిష్టాద్వైత వాంఙ్మయం అంతా పరిశీలించారు! ఈ సిద్ధాంతానికి సంబంధించి నాలాయరం అనే నాలుగువేల పాశురముల గ్రంథం ఇది! ద్రవిడ ప్రబంధం అని కూడా పేరు! వేదంతో సమానంగా భావిస్తారు!

అన్నమయ్య ఒక్కడూ రచించింది 32,000 కీర్తనలు! దానిలో అన్నీ విషయాలు ఉంటాయి!

వేంకటేశ్వర విజ్ఞాన సర్వస్వం అన్నట్లు మొత్తం క్షేత్రవైభవం, ఉపచారాలు, మొత్తం రచించారు!

వేంకటేశ్వరుడి గురించి ఏమైనా మిగిల్చాడా అనిపిస్తూ ఉంటుంది!

<u>కళ్యాణ వేంకటేశ్వరుడు</u>

శ్రీ అంటే పరమాత్మని ఆశ్రయించుకున్న శక్తి, మనందరికీ ఆశ్రయం అయినది!

భక్తుల మొరలు విని ఆయనకి వినిపిస్తుందిట అమ్మవారు!

4. పరమాత్ముడైన హరి పట్టపురాణివి నీవు"

ప|| పరమాత్ముడైన హరి పట్టపురాణివి నీవు | ధరమము విచారించ తగునీకు అమ్మ ||

చ|| కమలజుగన్న తల్లివి కామునిగన్న తల్లి | అమరులగన్న తల్లి ఆదిమ లక్ష్మి |
విమలపు నీపతికి విన్నపము జేసి మమ్ము | నెమకి ఏలితి దయ నీకే తగునమ్మ ||

చ|| కామధేను తోబుట్టుగ కల్పకము తోబుట్టుగ | దోమటి చల్లిన చంద్రు తోబుట్టుగ |
నీమగని పంపునను నిజసిరులిచ్చితివి | నేమపు వితరణము నీకే తగునమ్మ ||

చ|| పాలజలధి కన్యవు పద్మాసినివి నీవు | పాలపండే శ్రీవేంకటపతి దేవివి |
ఏలిన యితని బంట్లకు యిహపరాలిచ్చి మా | పాల గలిగితివి సంబంధము మేలమ్మ ||

- వీడు యోగ్యుడు వీడు కాడు అని చెప్పే తల్లి! ఆయనకు మాగురించి చెప్పి అనుగ్రహింపచేసే శక్తివి నువ్వే! ఆవిడ మహాపతివ్రత కనుక సరే అనుగ్రహిస్తాను అనిపించేలా చేస్తుందిట!
- నియమంతో కూడిన, హద్దు లేని వితరణం (ఇవ్వడం) నీకే తగును! ఇచ్చే శక్తులు అన్నీ నీకు తోబుట్టువులు కదా (కామధేనువు, కల్పవృక్షం, చంద్రుడు)
- పాలపండే = క్షీరసాగరంలో శయనించే

***అన్నమయ్య పాటల్లో అసలైన తెలుగు మాటలు దొరుకుతాయి కూడా!***

5. అలమేలుమంగా హరిఅంతరంగా
6. ఏమని పొగడుదునే నిను ఆమని సొబగుల అలమేలు మంగ"
7. చక్కని తల్లికి చాంగుభళా
8. కులుకక నడవరో కొమ్మలాలా"

కులుకక నడవరో కొమ్మలాలా
జలజల రాలీని జాజులు మాయమ్మకు

ఒయ్యనే మేను గదలీ నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీపాదతాకు కాంతులాలా
పయ్యెద చెఱగు జారీ భారపు గుబ్బల మిద
అయ్యో చెమరించె మా యమ్మకు నెన్నుదురు

చల్లెడి గందవొడియై జారీ నిలువరో
పల్లకి వట్టిన ముద్దు బణతులాల
మొల్లమైన కుందనపు ముత్యాల కుచ్చులదర
గల్లనుచు గంకణాలు గదలీమాయమ్మకు

జమళి ముత్యాల తోడి చమ్మాళిగ లిడరో
రమణికి మణుల నారతు లెత్తరో
అమరించి కౌగిట నలమేలు మంగనిదె
సమకూడె వేంకటేశ్వరుడు మా యమ్మకు

- అమ్మవారు పల్లకిలో వస్తున్నదిట, ఆడబోయిలు మోస్తున్నారుట! అన్నమాచార్య వారితో అంటున్నారు జాగ్రత్తగా నడవండి అంటూ! అమ్మ కదిలిపోతున్నది, జాగ్రత్తగా నడవండి! ఆ శ్రీపాదాలని తాకే ఓ కాంతలారా కాఠిన్యంగా నడవకండి! మా అమ్మకి నుదురు చెమట పడుతున్నది మీ నడకవల్ల! ***పల్లకి కుదుపులకు కదులుతున్న అమ్మవారి కంకణాల సవ్వడి విన్న అన్నమయ్య భావ శ్రవణానికి ఒక నమస్కారం!***
- "జమళి ముత్యాలతోడి చమ్మాళిగ" - అమ్మవారు పల్లకి దిగి వస్తున్నది! అమ్మవారు పాదుకలు ఎలా ఉన్నాయంటే బంగారు రేకు తాపడంతో ఉండి ముత్యాలు వెళ్ళాడుతున్నాయి! అమ్మవారికి రత్నాల హారతి ఇవ్వండి,

9. **పసిడి అక్షతలివే పట్టరో**

    **పసిడియక్షంతలివె పట్టరో వేగమె రారో**
    **దెసల పేరంటాండ్లు దేవుని పెండ్లికిని**

    **శ్రీవేంకటేశ్వరునికి శ్రీ మహాలక్ష్మికి**
    **దైవికపు పెండ్లిముహూర్తము నేడు**
    **కావించి భేరులు మ్రోసె గరుడధ్వజంబెక్కె**
    **దేవతలు రారో దేవుని పెండ్లికిని**

    **కందర్ప జనకునకి కమలాదేవికి పెండ్లి**
    **పందిలిలోపల తలంబాలు నేడు**
    **గంధమూ విడెమిచ్చేరు కలువడాలు గట్టిరి**
    **అందుక మునులు రారో హరి పెండ్లికిని**

    **అదె శ్రీ వేంకటపతికి అలమేలు మంగకును**
    **మొదలి తిరుణాళ్ళకు మ్రొక్కేము నేడు**
    **యెదుట నేగేరు వీరెయిచ్చేరు వరములివె**
    **కదలిరారో పరుష ఘనుల పెండ్లికిని**

ఇది అద్భుత కీర్తన! అక్షతలు పట్టుకోండి, రండి, రండి అని అందరినీ ఆహ్వానిస్తారు!

10. పిడికిట తలంబ్రాల పెళ్లికూతురు"

ప|| పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు కొంత | పెడమరలి నవ్వీనె పెండ్లి కూతురు ||

చ|| పేరుకల జవరాలె పెండ్లి కూతురు పెద్ద | పేరుల ముత్యాల మెడ పెండ్లి కూతురు |

పేరంటాండ్ల నడిమి పెండ్లి కూతురు విభు | పేరుకుచ్చ సిగ్గువడీ బెండ్లి కూతురు ||

చ|| బిరుదు పెండము వెట్టె బెండ్లి కూతురు నెర | బిరుదు మగని కంటె బెండ్లి కూతురు |

పిరిదూరి నప్పుడే పెండ్లి కూతురూ పతి | బెరరేచీ నిదివో పెండ్లి కూతురు ||

చ|| పెట్టెనే పెద్ద తురుము పెండ్లి కూతురు నేడె | పెట్టెడు చీరలు గట్టి పెండ్లి కూతురు |

గట్టిగ వేంకటపతి కౌగిటను | పెట్టిన నిధానమయిన పెండ్లి కూతురు ||

చిత్రాన్ని చక్కగా చూపిస్తున్నారు! ఆవిడపై తలంబ్రాలు వేసినప్పుడు ఆవిడకి ఆనందం కలిగి పక్కకి తిరిగి నవ్వుతుంది! ఆనాటి సంప్రదాయంలో ఉన్న వధువు సిగ్గు పడుతున్న విషయం

11. పెట్టని కోటిందరికి పెండ్లికొడుకు బొమ్మపెట్టెనసురులకెల్ల పెండ్లికొడుకు"

పెట్టని కోటిందరికి పెండ్లికొడుకు బొమ్మబెట్టె నసురుల కెల్ల పెండ్లికొడుకు ||

పెల్లగించి భూమెత్తీ బెండ్లి కొడుకు వాడె పిల్లగోవి రాగాల పెండ్లికొడుకు

పెల్లైన యీవుల పెండ్లికొడుకు వాడె పిల్లదీవు పెన్నుద్ది పెండ్లికొడుకు ||

పించెపు శిరసుపాగ పెండ్లికొడుకు గుంపించిన కోపగించీ పెండ్లికొడుకు

పెంచకప్పుడే పెరిగె పెండ్లికొడుకు వలపించె జక్కని సిరి పెండ్లికొడుకు ||

పెంట పెరుగులదొంగ పెండ్లికొడుకు భూమిపెంటి పోతుల గూరిచె పెండ్లికొడుకు

గెంటులేని వేంకటగిరి మీదను వాడెవెంట వెట్టుకున్నవాడు పెండ్లికొడుకు

పెండ్లికొడుకు మీద కూడా రచించారు! ఈయన సామాన్యుడు కాడు అసురులను దునుమాడాడు! భూమిని ఎత్తిన చేతులు, పిల్లగోవి ఊదిన చేతులు, వరములు పెల్లుగా ఇస్తాడట, అంటే మిక్కిలిగా ఇస్తాడు అని!

## అన్నమయ్య దర్శించిన వేంకటేశ్వర పాదాలు

12. బ్రహ్మకడిగిన పాదము

ప|| బ్రహ్మకడిగిన పాదము | బ్రహ్మము దానె నీ పాదము ||

చ|| చెలగి వసుధ గొలిచిన నీ పాదము | బలితల మోపిన పాదము |

తలకక గగనము తన్నిన పాదము | బలరిపు గాచిన పాదము ||

చ|| కామిని పాపము కడిగిన పాదము | పాముతల నిడిన పాదము |

ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము | పామిడి తురగపు పాదము ||

చ|| పరమ యోగులకు పరి పరి విధముల | వర మొసగెడి నీ పాదము |

తిరు వేంకటగిరి తిరమని చూపిన | పరమ పదము నీ పాదము ||

బ్రహ్మదేవుడే కదా చూసి ప్రతిష్ఠ చేసారు, అంతేకాక త్రివిక్రముడిగా వచ్చినప్పుడు బ్రహ్మదేవుడు కడిగాడు స్వామి పాదాలు!

"చెలఁగి వసుధ గొలిచిన పాదము,

ఇంద్రుని రక్షించడం కోసం ఇదంతా చేసారు

కామిని పాపము కడిగిన పాదము! అంటూ రామావతారాన్ని కూడా చెప్పారు

పాము తలనిడిన పాదము, ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము

పామిడి (పాదమిడి) తురగపు పాదము అన్నప్పుడు కల్కి అవతారాన్ని గుర్తు చేసారు, అంతేకాక వేంకటపతి వేటకి వెళ్లిన ఘట్టం కూడా గుర్తు చేసారు!

13. ఈ పాదమే కదా ఇలా ఎల్ల కొలిచినది

ఈ పాదమే కదా ఇలయెల్ల గొలిచినది ఈ పాదమే కదా ఇందిరా హస్తముల సితవైనది॥

ఈ పాదమే కదా ఇందరును మ్రొక్కెడిది

ఈ పాదమే కదా ఈ గగనగంగ పుట్టినది

ఈ పాదమే కదా యెలమి పెంపొందినది

ఈ పాదమే కదా ఇన్నిటికిని యెక్కుడైనది॥

ఈ పాదమే కదా యిభరాజు దలచినది
ఈ పాదమే కదా యింద్రాదులెల్ల వెదకినది
ఈ పాదమే కదా యీబ్రహ్మ కడిగినది
ఈ పాదమే కదా యెగసి బ్రహ్మాండమంటినది॥

ఈ పాదమే కదా ఇహపరము లొసగెడిది
ఈ పాదమే కదా ఇల నహల్యకు కోరికైనది
ఈ పాదమే కదా యీక్షింప దుర్లభము
ఈ పాదమే కదా ఈ వేంకటాద్రిపై నిరవైనది॥

**స్వామి చేతులపై అనేక కీర్తనలు**

వరద హస్తం, కటి హస్తం కానీ ఆయన అన్నీ చేతులు అభయహస్తాలే!

14. ఇన్ని లాగుల చేతులు"

ఇన్నిలాగులచేత లివియపో కడు
నెన్నికకెక్కిన చేతులివియపో ||

గునియుచు దనునెత్తికొమ్మని తల్లిపై
నెనయజాచిన చేతులివియపో
కినిసి గోవర్ధనగిరి వెల్లగించిన
యినుమువంటి చేతులివియపో ||

పిసికి పూతకిచన్ను బిగియించిపట్టిన
యిసుమంతలు చేతులివియపో
పసుల గాచుచు గొల్లపడచుల యమునలో
యిసుకచల్లిన చేతులివియపో ||

పరమచైతన్యమై ప్రాణులకెల్లను

యొరవులిచ్చిన చేతులివియవో

తిరువేంకటగిరి దేవుడై ముక్తికి

నిరవుచూపెడు చేతులివియవో ||

సుకుమారమైన చేతులు అనుకుంటున్నారేమో అవసరమైతే కఠినంగా కూడా ఉంటాయి! (కృష్ణపరమాత్మ గురించి) చిన్ని చేతులు అని మెత్తవి అనుకుంటున్నారేమో, కోపంతో గోవర్ధన గిరి పెళ్ళగించిన ఇనుము వంటి చేతులు ఇవియేవో!

15. ఇందరికీ అభయములిచ్చు చేయి"

ఇందరికీ అభయంబులిచ్చు చేయి

కందువగు మంచి బంగారు చేయి !!

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి

చిలుకు గుబ్బలి క్రింద చేర్చు చేయి

కలికి యగు భూకాంత కౌగలించిన చేయి

వలనైన కొనగోళ్ళ వాడి చేయి !!

తనివోక బలి చేత దానమడిగిన చేయి

ఒనరంగ భూదాన మొసగు చేయి

మొనసి జలనిధి యమ్ముమొనకు దెచ్చిన చేయి

ఎనయ నాగేలు ధరియించు చేయి !!

పురసతుల మానములు పొల్లసేసిన చేయి

తురగంబు బరపెడి దొడ్డ చేయి

తిరువేంకటాచలా ధీశుడై మోక్షంబు

తెరువు ప్రాణుల కెల్ల తెలిపెడి చేయి !!

అన్నీ అవతారాలు చూపిస్తారు! దశావతారాలని చేతులలో చూపించడం సామాన్యం కాదు!

(భావరాగలయాత్మకం ముఖ్యం ఎప్పుడు రాగం చూడడం కాదు)

ఎలాంటి చేయి?

వేదములు వెదకి తెచ్చిన చేయి - మత్స్య,

చిలుకు గుబ్బలి కింద చేర్చు చేయి  - కూర్మావతారం,

కలికియగు భూకాంత కౌగిలించిన చేయి - వరాహ,

వలనైన కొనగోళ్ళ వాడి చేయి - నృసింహ,

బలిచేత దానమడిగిన చేయి - వామన,

ఒనరంగ భూదానం ఒసగు చేయి - పరశురామ,

మొనసి జలనిధిని అమ్ముమొనకు తెచ్చిన చేయి - రామావతారం,

ఎనయ నాగెలు ధరియించు చేయి - బలరామ,

పురసతుల మానములు పొల్ల సేసిన చేయి - బుద్ధావతారం (త్రిపురాసుర సంహారానికి ముందర అసురుల పత్నులను ధర్మచ్యుతం చేసిన స్వామి) ఇది పురాణ బుద్ధుడు,

తురగంపు బరపెడి దొడ్డ చేయి - కల్కి అవతారం

అటువంటి స్వామి ఎవరు అంటే తిరువేంకటాధీశుడు, ఆయన మోక్షానికి ఇది మార్గము అని చూపిస్తున్నాడు తన చేతిని! (వరద, కటి హస్తాలు)

సంసారం సముద్రంలో మీరంతా మునిగిపోయారు, ఇదిగో నా పాదాలని ఆశ్రయించండి, అప్పుడు సముద్రం నడుములోతు మాత్రమే అయి హాయిగా బయటపడతారు అంటున్నారట స్వామి!

అన్నమయ్య దశావతారాల మీద ఎన్నో కీర్తనలని రచించారు!

చేతిని వర్ణిస్తూ దశావతారాలని వర్ణించిన అన్నమయ్య చేయి అద్భుతం!

**<u>దశావతార వైభవం</u>**

16. పుడమినిందర పట్టె భూతము కడు వొడవైన నల్లని భూతము

ప|| పుడమి నిందరి బట్టెభూతము కడు- | బొడవైన నల్లనిభూతము ||

చ|| కినిసి వోడమింగెడి భూతము | పునుకవీపు పెద్దభూతము |
కనలి కవియు చీకటిభూతము | పొనుగు సోమపుమోము భూతము ||

చ|| చేతగాళ్ళ మించినభూతము | పోటుదారల పెద్దభూతము |
గాటపుజడల బింకపుభూతము | జూటరినల్లముసుగు భూతము ||

చ|| కెలసి బిత్తలేతిరిగేటి భూతము | వొలుపుదాంట్ల పెద్దభూతము |
బలుపు వేంకటగిరిపై భూతము | పులుగుమీది మహాభూతము ||

*భూతము పట్టేస్తే ఎవడి అధీనంలో వాడు ఉండడు కదా! నిజానికి ఎవరైనా వారి అధీనంలో వారు ఉన్నా రా? జగత్తంతా ఈశ్వరాధీనంలో ఉన్నా రు! కనుక ఈశ్వరుడు అనే భూతము అందరినీ పట్టేసింది! ఏమిటా నల్లని భూతము? కృష్ణ!*

కినిసి వోడమింగెడి భూతము - మత్స్య,
పునుకవీపు పెద్దభూతము - కూర్మ,
కనలి కవియు చీకటిభూతము (ఆక్రమించుకున్నదిట భూమిని) - వరాహ,
వొనుగు సోమపుమోము భూతము - నృసింహ,
చేతగాళ్ళ మించినభూతము - త్రివిక్రమ/వామన,
వోటుదారల పెద్దభూతము - పరశురామ,
గాటపుజడల బింకపుభూతము - రామావతారం,
జూటరినల్లముసుగు భూతము - కృష్ణావతారం,
కెలసి బిత్తలేతిరిగేటి భూతము - బుద్ధావతారం (పురాణబుద్ధావతారం),
వొలుపుదాంట్ల పెద్దభూతము - వొలుపుదాంట్ల అంటే లంఘించిన అని అర్థము - కల్కి అవతారం!
ఆ పదివేసాల భూతము వచ్చి కూర్చుందిట, అది వేంకటగిరి మహాభూతము!
"ఏకో విష్ణు: మహద్భూత:" అంటే ఇదే!

*నాస్తికుడైన అన్నమయ్య కవిత్వానికి ఒళ్ళు పులకించి దండం పెట్టక తప్పదు!*

*వేంకటేశ్వరుని పొలముతో పోల్చడం - దశావతారాలని చూపిస్తున్నా రు*

17. తిమ్మిరెడ్డి మాకునిచ్చే దిష్టమైన పొలము"

తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైన పొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము

నిండినట్టిమడుగుల నీరువంకపొలము (మత్స్య)

కొండలుమోచిన పెద్దగొబ్బరపుఁబొలము (కూర్మ)

అండనే పొలమురాజులుండేటి పొలము (వరాహ)

చెండివేసి మాకులెల్లా సెలగిన పొలము (నృసింహ)

ఆసపడి వరదానమడిగిన పొలము (వామన)

బాసలతోఁ గడు నెత్రుపట్టమైనపొలము (పరశురామ)

రాసికెక్కే మునులకు రచ్చైనపొలము (రామావతారం)

వేసరక నాగేట వేగిలైన పొలము (బలరామ)

మంచి గురుతైన రావిమేనిచేనిపొలము (బుద్ధావతారం)

వంచిన గుఱ్ఱముఁ దోలే వయ్యాళి పొలము (కల్కి)

యెంచగ శ్రీవేంకటేశు నిరవైన పొలము

పంచుకొని లోకులెల్లా బ్రదికేటిపొలము

- ఆ వేంకటపతి అనుగ్రహంతో స్వరూపాన్ని ఇచ్చాడు, అదే మమ్మల్ని పండించే పొలము అయినది! బ్రహ్మదేవుడికి జగత్తుని అప్పగించి చూసుకోమన్నాడు!
- బుద్ధావతారం ధరించి రావిచెట్టు దగ్గర నిలబడతాడుట అప్పుడు త్రిపురాసురుల పత్నులు మోహింపబడతారుట!
- ***పంచుకొని లోకులెల్లా బ్రతికేటి పొలము - విష్ణుమూర్తి శక్తియే పంచబడి, ప్రతీవారు స్వామి శక్తితోనే బ్రతుకుతున్నారు! విష్ణువు అనే పొలాన్ని పంచుకుని మనమంతా బ్రతుకుతున్నాము!***

***దొంగగా దశావతారాలు చూపిస్తున్నారు***

18. వీడివో ఇదె వింత దొంగ"

పll వీడివో యిదె వింతదొంగ | వేడిపాలు వెన్న వెరజినదొంగ ||

చll వెలయ నీట జొప్పువేసేటి దొంగ | తలగాననీక దాగుదొంగ |

తలకక నేలదవ్వేటిదొంగ | తెలిసి సందెకాడ దిరిగేటి దొంగ ||

చll అడుగుకింద లోకమడచేటి దొంగ | అడరి తల్లికినైన నలుగుదొంగ |

అడవిలో నెలవైయున్న దొంగ | తొడరి నీలికాసెతో నుండుదొంగ ||

చ|| మోస మింతుల జేయుమునిముచ్చుదొంగ | రాసికెక్కినగుజ్జుంపుదొంగ |
వేసాల కిటు వచ్చి వెంకటగిరిమీద | మూసినముత్యమై ముదమందుదొంగ ||

వేడి పాలు తిన్న దొంగ అట!
కృష్ణపరమాత్మ పది అవతారలకి మూలము! అవతారాల్లో ఒకడు కాడు!
మూసినముత్యమై ముదమందుదొంగ - దాచబడిన ముత్యము వలె ఉన్నాడు!

19. మూసినముత్యాలకేలే మొరగులు

**విరాట్పురుషుడి పరంగా వ్రాస్తున్నారు!**

20.తెప్పగ మఱ్ఱాకు మీద తేలాడు వాడు"

ప|| తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడువాడు | ఎప్పుడు లోకములెల్ల నేలేటివాడు ||

చ|| మోతనీటి మడుగులో యీతగరచినవాడు | పాతగిలే నూతిక్రింద బాయనివాడు |
మూతిదోసిపట్టి మంటిముద్ద పెల్లగించువాడు | రోతయైన పేగుల పేరులు గలవాడు ||

చ|| కోడికూత నోరివాని కుఱ్ఱతమ్ముడైనవాడు | బూడిద బూసినవాని బుద్ధులవాడు |
మాడవన్నె లేడివెంట మాయలబడినవాడు | దూడల నావులగాచి దొరయైనవాడు ||

చ|| ఆకసానబారే వూరి అతివల మానముల | కాకుసేయువాడు తురగముపైవాడు |
ఏకమై వేంకటగిరి నిందిరారమణి గూడి | యేకాలముబాయని యెనలేనివాడు ||

నారాయణుడి తొలిరూపము ఇది! కృష్ణరూపమే మొదట చూపారు!
మోతనీరు మడుగు = సముద్రం; విరాట్పురుషుడికి సముద్రం మడుగే కదా!
మోతనీటి మడుగులో యీతగరచినవాడు - మత్స్య
పాతగిలే నూతిక్రింద బాయనివాడు - కూర్మ
మూతిదోసిపట్టి మంటిముద్ద పెల్లగించువాడు - వరాహ
రోతయైన పేగుల పేరులు గలవాడు - నృసింహ

కోడికూత నోరివాని కుర్రతమ్ముడైనవాడు (ఇంద్రుడి తమ్ముడు) - వామన

బూడిద బూసినవాని బుద్ధులవాడు (శివుని వద్ద చదువు నేర్చినవాడు) - పరశురామ

మాడవన్నె లేడివెంట మాయలబడినవాడు - రాములవారు

దూడల నావులగాచి దొరయైనవాడు - కృష్ణపరమాత్మ

ఆకసానబారే వూరి అతివల మానముల కాకుసేయువాడు - త్రిపురాసురుల పత్నుల ధర్మము చ్యుతము చేసినవాడు

21. చిరుతనవ్వులవాడు"

## రామావతారం - అన్నమాచార్య కీర్తనలు

22. అంతయు నీవే హరి పుండరీకాక్ష చెంత నాకు నీవే శ్రీరఘురామ

23. రామా దయాపరసీమా"

రామా దయాపరసీమా అయోధ్యపుర
ధామా మావంటివారితప్పులు లోగొనవే

అపరాధియైనట్టియాతనితమ్ము నినే
కృపజూపితివి నీవు కింకలు మాని
తపియించి యమ్ము మొన దారకుజిక్కినవాని
నెపాన గాచి నిడిచి నీవాదరించితివి

సేయరాని ద్రోహము సేసినపక్షికి నీవి
పాయక అప్పటి నభయమిచ్చితి
చాయసేసుకొని వుండి స్వామి ద్రోహి జెప్పనట్టి
తోయపుటేటెని మంచితోవనే పెట్టితివి

నేరము లెంచవు నీవు నీదయే చూపుదుగాని
బీరపు శరణాగరబిరుద నీవు
చేరి నేడు నిలుచుండి శ్రీవేంకటాద్రిమీద

గోరినవరములెల్లా కొల్ల లొసగితివి

24. ఇదియే పరబ్రహ్మము ఇదియే రామకథా"

25. రాజీవనేత్రాయల రాఘవాయ నమో సౌజన్యనిలయాయ జానకీశాయ"

ప|| రాజీవ నేత్రాయ రాఘవాయ నమో |

సౌజన్య నిలయాయ జానకీశాయ ||

చ|| దశరథ తనూజాయ తాటక దమనాయ |

కుశిక సంభవ యజ్ఞ గోపనాయ |

పశుపతి మహా ధనుర్భంజనాయ నమో |

విశద భార్గవరామ విజయ కరుణాయ ||

చ|| భరిత ధర్మాయ శుర్పణఖాంగ హరణాయ |

ఖరదూషణాయ రిపు ఖండనాయ |

తరణి సంభవ సైన్య రక్షకాయనమో |

నిరుపమ మహా వారినిధి బంధనాయ ||

చ|| హత రావణాయ సంయమి నాథ వరదాయ |

అతులిత అయోధ్యా పురాధిపాయ |

హితకర శ్రీ వేంకటేశ్వరాయ నమో |

వితత వావిలిపాటి వీర రామాయ ||

సుజనస్య భావం సౌజన్యం, మంచి మానవుడు, మానవీయ గుణములన్ని ఉత్కృష్టముగా ఉన్న వారిని అంటారు!

26. ఇదే శిరసు మాణిక్యం ఇచ్చిపంపె నీకు

ఇదే శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకె

అదనెరిగి తెచ్చితిని అవధరించవయ్యా

రామా నిను బాసి నీ రామా నే చూడగ ఆ
రామమున నిను పాడెను రామ రామ యనుచు
ఆ మెలుత సీతయని అపుడు నే తెలిసి
నీ ముద్ర ఉంగరము నేనిచ్చితిని

కమలాప్తకులుడా నీ కమలాక్షి నీ పాద
కమలములు తలపోసి కమలారిదూరె
నెమకి ఆలేమను నీ దేవియని తెలిసి
అమరంగ నీ సేమమటు విన్నవించితిని

దశరథాత్మజా నీవు దశశిరుని చంపి
ఆ దశనున్న చెలిగావు దశ దిశలు పొగడ
రసికుడ శ్రీ వెంకట రఘువీరుడా నీవు
శశిముఖి చేకొంటివి చక్కనాయె పనులు

సంవాద గీతం! హనుమంతుల వారు వచ్చి స్వామివారికి అమ్మవారి శిరసు మాణిక్యం ఇచ్చే ఘట్టం!
దీనిలో శబ్దప్రయోగం అద్భుతం!
కమలారిదూరే - చంద్రుడి వెన్నెల వేడిగా ఉండి చంద్రుని నిందించడం

27. అపుడేమనెను ఏమనుమనెను
అపుడేమనె నేమనుమనెను
తపమే విరహపు తాపమనె

పవనజ యేమనె పడతిమరేమనె
అవనిజ నిను నేమను మనెను
రవికులేంద్ర భారము ప్రాణంబనె
ఇవల నెట్ల ధరియించే ననె

యింకా నేమనె యింతి మరేమనె

కొంకక యేమని కొసరుమనె
బొంకుల దేహము పోదిది వేగనె
చింక వేట ఇటు చేసెననె

నను నేమనె ప్రాణము మన కొకటనె
తనకు నా వలెనె తాపమనె
మను కులేశ ప్రేమపు మనకూటమి
ఘనవేంకటగిరి గంటిననె

సంవాద గీతం

సీతమ్మ ఇంకా ఏముందో చెప్పు అని అడుగుతూ ఉంటారు రాములవారు!

అప్పుడు ఏమనింది? నాతో ఏమని అనమనింది?

***తపమే విరహపు తాపమనే - ఒక్కమాటలో ఎంత పెట్టారంటే అన్నమయ్య ముందర ఎవరు నిలుస్తారు?***

***భగవద్విరహమే తపస్సు!***

బొంకుల దేహము ఇంకా పోదే అంటున్నది అమ్మవారు అంటూ విరహాసక్తి భక్తిని సీతమ్మ రూపంగా దర్శింపచేసారు!

**అన్నమాచార్య కీర్తనలు - కృష్ణ పరమాత్మపై అనేకం రచించారు** చిన్నకృష్ణుడి నుండి గీతాచార్యుడి వరకు

28.చిన్ని శిశువు

చిన్ని శిశువు చిన్ని శిశువు
ఎన్నడు చూడమమ్మ ఇటువంటి శిశువు॥

తోయంపు కురులతోడ తూగేటిశిరసు, చింత
కాయలవంటి జడలా గములతోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాలతోడ
పయక యశోద వెంట పారాడు శిశువు॥

ముద్దుల వ్రేళ్ళతోడ మొరవంక యుంగరాల
నిద్దపు చేతుల పైడి బొద్దుల తోడ
అద్దపు చెక్కులతోడ అప్పలప్పలనినంత
గద్దించి యశోదమేను కౌగిలించు శిశువు॥

బలుపైన పొట్ట మీది పాల చారలతోడ
నులిపేడి వెన్నతిన్న నోరితోడ
చలగి నేడిదే వచ్చి శ్రీ వేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువు॥

29. పాలదొంగ వద్ద వచ్చి పాడేరు"

ప|| పాలదొంగవద్ద వచ్చి పాడేరు తమ- | పాలిటిదైవమని బ్రహ్మాదులు ||

చ|| రోల గట్టించుక పెద్దరోలలుగా వాపోవు | బాలునిముందర వచ్చి పాడేరు |
ఆలకించి వినుమని యంబరభాగమునందు | నాలుగుదిక్కులనుండి నారదాదులు ||

చ|| నోరునిండా జొల్లుగార నూగి ధూళిమేనితో | పారేటిబిడ్డనివద్ద బాడేరు |
వేరులేనివేదములు వెంటవెంట జదువుచు | జేరిచేరి యింతనంత శేషాదులు ||

చ||ముద్దులు మోమునగార మూలలమూలలదాగె|బద్దులబాలుని వద్ద బాడేరు |
అద్దివో శ్రీతిరువేంకటాద్రీశుడితడని | చద్దికి వేడికి వచ్చి సనకాదులు ||

దేవతలు వచ్చి తిరుగుతున్నారట చిన్నకృష్ణుడి వెనక, ఎందుకంటే వైకుంఠం వద్ద ఇలా చూడలేరు కదా!

**30.** ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము" నవరత్నాలతో పరమాత్మని వర్ణిస్తారు!

31. తానే తానే ఇందరి గురుడు"

జగద్గురువుగా కృష్ణపరమాత్మని చూపిస్తారు. పరమాత్మ భోగిలా కనిపిస్తారు కానీ ఎవరి కర్మలకి తగ్గట్లు వారికి ఫలాలను ఇచ్చే మహాయోగి!

32. అని ఆనతిచ్చె కృష్ణుడర్జునునితో" - గీతావచనం (15వ అధ్యాయం ప్రధాన శ్లోకాలు)

అని యానతిచ్చెఁ గృష్ణుఁ డర్జునునితో
విని యాతని భజించు వివేకమా // పల్లవి //

భూమిలోను చొచ్చి సర్వభూతప్రాణులనెల్ల
దీమసాన మోచేటిదేవుఁడ నేను
కామించి సస్యములు గలిగించి చంద్రుఁడనై
తేమల బండించేటిదేవుఁడ నేను // అని //

దీపనాగ్నినై జీవదేహములయన్నములు
తీపుల నరగించేటిదేవుఁడ నేను
యేపున నిందరిలోనిహృదయములోన నుందు
దీపింతుఁ దలఁపుమరపై దేవుఁడ నేను // అని //

వేదములన్నిటిచేతా వేదాంతవేత్తలచే
ఆది నే నెరఁగఁదగినయాదేవుఁడను
శ్రీదేవితోఁ గూడి శ్రీవేంకటాద్రిమీఁద
పాదైనదేవుడఁను భావించ నేను // అని //

<u>హనుమంతుడిపై అన్నమాచార్య కీర్తనలు</u>

హనుమదుపాసకులు అన్నమాచార్య! హనుమంతుడు రామభక్తుడు అని ఎంత ఒప్పుకుంటాడో, ఆయన సర్వదేవతాత్మకుడు అని కూడా అంత ఒప్పుకుంటాడు!

33. ఒక్కడే ఏకాంగవీరుడు - బ్రహ్మవిష్ణుశివాత్మకుడు అని చెప్పే కీర్తన! అలాగే సూర్య, శేషుడు (మయిరావణుడుని సంహరించేటప్పుడు), జగత్ప్రాణుడు, చంద్రుడు (సురసని ప్రసన్నం చేస్కుని సింహికను చంపి సముద్రం నుండి పైకి వచ్చేటప్పుడు), సింహమైనాడు
34. మంగాంబుధి హనుమంత
35. ఓ పవనాత్మజ ఓ ఘనుడా
36. ఏలావయ్య లోకమెల్ల ఇట్టా రాము దీవెనచే" హనుమా నీకు రక్షా రక్షా! అంటూ హనుమంతుడికి రక్ష పెడుతున్నారు

ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే

నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష

మొదల నింద్రుఁడు నీ మోమునకెల్లా రక్ష

యిదె నీ శిరసునకు నినుఁడు రక్ష

కదిసి నీ కన్నులకు గ్రహతారకాలు రక్ష

చెదరని మేనికెల్ల శ్రీ రామరక్ష

పిరుఁదు వాలమునకు బెడిదపు శక్తి రక్ష

గరుడఁడు నీకరయుగముల రక్ష

గరిమ నీకుక్షికి కరివరదుఁడు రక్ష

సిరుల నీ మహిమకు శ్రీ రామ రక్ష

వడి నీ పాదములకు వాయుదేవుఁడు రక్ష

తొడలకు వరుణుఁడు తొడగు రక్ష

విడువని మతికిని వేద రాసులే రక్ష

చెడని నీ ఆయువుకు శ్రీరామరక్ష

నలువ నీగళ రక్ష నాలుక కుర్వర రక్ష

అలర నీసంధులకు హరుఁడు రక్ష

పలు నీరోమములకు బహుదేవతలు రక్ష

చెలఁగు నీచేతలకు శ్రీ రామరక్ష

అంగపు నీతేజమునకు అగ్నిదేవుఁడు రక్ష

శృంగారమున కెల్లా శ్రీసతి రక్ష

మంగాంబుధి హనుమంత నీకేకాలము

చెంగట శ్రీ వేంకటాద్రి శ్రీరామరక్ష

రాములవారు హనుమంతుడిని ఉండమంటాడు భూమి మీద లోకాన్ని రక్షిస్తూ ఉండమని!

స్వామికి ఏ స్థానంలో ఏ దేవత ఉందో కూడా చెప్పడం! ఆ యా మనల్ని ఆ శక్తులు రక్షించుగాక! అని కూడా!

విడువని మతికి వేదరాశులే రక్ష అన్నారు అద్భుతంగా!

చెదరని నీమేనికెల్ల శ్రీరామరక్ష! అంటూ ఉంటారు ప్రతీ చరణంలో!

చెడని నీ ఆయువునకు శ్రీరామరక్ష! చెలగు నీ చేతలకు శ్రీరామరక్ష

**తాత్త్వికత - దార్శనికత**

37.భారమైన వేపమాను పాలు వోసి పెంచినాను

ప|| భారమైన వేపమాను పాలువోసి పెంచినాను | తీరని చేదేకాక దియ్యనుండీనా ||

చ|| పాయదీసి కుక్కతోక బద్దలు వెట్టి బిగిసి | చాయ కెంతగట్టినాను చక్కనుండీనా |

కాయపు వికారమిది కలకాలము జెప్పినా | పోయిన పోకలే కాక బుద్ధి వినీనా ||

చ|| ముంచిముంచి నీటిలోన మూల నానబెట్టుకొన్నా | మించిన గొడ్డలి నేడు మెత్తనయ్యి నా |

పంచమహాపాతకాల బారి బడ్డచిత్తమిది | దంచి దంచి చెప్పినాను తాకి వంగీనా ||

చ|| కూరిమితో దేలుదెచ్చి కోకలోన బెట్టుకొన్నా | సారె సారె గుట్టుగాక చక్కనుండీనా |

వేరులేని మహిమల వేంకటవిభుని కృప | ఘోరమైన ఆస మేలుకోర నోకీనా ||

భారమైన వేపమాను పాలువోసి పెంచినాను - పాలుపోసి పెంచినా వేపచెట్టు తీపిపండ్లు ఇస్తుందా? అలా బుద్ధి మాటవింటుందా?

పాయదీసి కుక్కతోక బద్దలు వెట్టి బిగిసి - కుక్కతోక వంకర అన్నట్లు కాయంపు వికారము ఇది పోతుందా? బుద్ధి వింటుందా?

ముంచిముంచి నీటిలోన మూల నానబెట్టుకొన్నా మించిన గొడ్డలి నేడు మెత్తనయ్యి నా " - దంచి దంచి చెప్పినాను తాకి వంగేనా

పంచమహాపాతకాల బారి బడ్డచిత్తమిది దంచి దంచి చెప్పినాను తాకి వంగీనా - పాపాలు అలవాటైపోయిన చిత్తానికి దంచి దంచి చెప్పినా బుద్ధి రావడంలేదయ్యా!

కూరిమితో దేలుదెచ్చి కోకలోన బెట్టుకొన్నా | సారె సారె గుట్టుగాక చక్కనుండీనా - తెలు తెచ్చి కోకలో పెట్టుకుంటే కుట్టకుండా ఉంటుందా?

నా సాధనలు నేను చేస్తున్నా నువ్వు అనుగ్రహించకపోతే తరించలేను, ఎందుకంటే చెడు అలవాటైనట్లు మంచి అలవాటు కాలేదు కదా! అంటూ నిస్సహాయతని చూపిస్తున్నారు!

అన్నమాచార్య కొత్తసామెతలు సృష్టిస్తారు, ఉన్న సామెతలకు కొత్త రంగు అద్దుతారు!
లోపలున్న పరమాత్మను మరచి ఎక్కడో తిరుగుతావేంటి అని చెప్పే కీర్తనలు!

38.మొదలుండ గొనలకు మోచి నీళ్ళు వోయనేల

ప|| మొదలుండ గొనలకు మోచి నీళ్ళు వోయనేల | యెదలో నీవుండగా నితరము లేలా ||

చ|| నిగమ మార్గముల నే నడచే నంటే | నిగము లెల్లను నీమహిమే |

జగము లోకుల జూచి జరిగెద నంటే | జగములు నీ మాయ జనకములు ||

చ|| మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండే నంటే | మనసు కోరికెలు నీ మతకాలు |

తనువు నింద్రియములు తగ గెలచే నంటే | తనువు నింద్రియములు దైవము నీ మహిమా ||

చ|| ఇంతలోని పనికిగా యిందు నందు జొరనేల | చెంత నిండు చెరువుండ చెలమ లేలా |

పంతాన శ్రీవేంకటేశ పట్టి నీకే శరణంటి | సంత కూటాల ధర్మపు సంగతి నాకేలా ||

39. అనయము శ్రీవేంకటేశ్వరుని కొలవక మనసులో వాడిని మరచేమయ్య"

చెట్టుకు మొదట్లో కదా నీరు పోయాలి

ఇంతలోని పనికి ఇందునందు చోరనేల చెంతనిండ చెంత నిండు చెరువుండ చెలమ లేలా!

***భగవత్ సాధన అంటే అంతరంగ సాధన - సత్యము, అహింస మొదలైన గుణములతో సాధన చేస్తూ, చింతన చేస్తూ భక్తితో, ధ్యానం, ప్రేమచూపించడం ఇదంతా అంతరంగసాధన!***

40.తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు"

ప|| తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు | మనసు చంచల బుద్ధి మానీనా ||

చ|| జడ్డు మానవుడు చదువ జదువు నాస | వడ్డివారుగాక వదలీనా |

గుడ్డికుక్క సంతకుబోయి తిరిగిన | దుడ్డు పెట్లే కాక దొరకేనా ||

చ|| దేవదూషకుడై తిరిగేటి వానికి | దేవతాంతరము తెలిసీనా |

శ్రీవేంకటేశ్వరు సేవాపరుడుగాక | పావనమతియై పరగీనా ||

ఎన్ని చదువుకున్నా మనస్సుకు చాంచల్యం ఉన్నప్పుడు ఆ చదువులు వృధా!

జడ్డు మానవుడు (పరమార్థం తెలియని మానవుడు) చదువ చదువ వాడి ఆశలు నిగ్రహించుకోవడం కాదు ఇంకా పెరిగి పోతున్నాయి! ఇది ఎటువంటిది అంటే, గుడ్డికుక్క సంతకు వెళితే దెబ్బలే కదా!

41. అప్పు లేని సంసారం అయినపాటే చాలు తప్పు లేని జీతము ఒక్క తారమైన చాలు"

అప్పులేని సంసార మైనపాటే చాలు

తప్పులేని జీతమొక్క తారమైన జాలు // పల్లవి //

కంతలేని గుడిసొక్క గంపంతైన జాలు
చింతలేని యంబలొక్క చేరెడే చాలు
జంతగాని తరుణి యేజాతైన నాదె చాలు
వింతలేని సంపదొక్క వీసమే చాలు // అప్పులేని //

తిట్టులేని బ్రదుకొక్క దినమైన నదే చాలు
ముట్టులేని కూడొక్క ముద్దెడే చాలు
గుట్టుచెడి మనుకంటే కొంచెపు మేలైన చాలు
వట్టిజాలి బడుకంటే వచ్చినంతే చాలు // అప్పులేని //

లంపటపడని మేలు లవలేసమే చాలు
రొంపికంబమౌకంటె రోయుటే చాలు
రంపపు గోరికకంటే రతి వేంకటపతి
పంపున నాతని జేరే భవమే చాలు // అప్పులేని //

అవినీతి లేకుండా వచ్చే డబ్బు కాస్త అయినా చాలు
తిట్టు లేని జీవితం ఒక్క రోజు అయినా చాలు
ముట్టు లేని కూడు ముద్ద అయినా చాలు అంటున్నారు
రంపపు కోరిక = కోస్తూనే ఉంటుంది
గొడ్డలి కోరిక = ఒక్క దెబ్బతో పోతుంది
వీటికంటే స్వామినే లంపటం అని పట్టుకుంటే చాలు కదా!

42. మనుజుడై పుట్టి మనుజుడిని సేవించి"
మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖమందనేలా

జుట్టెడు గడుపుకై చొరనిచోట్లు చొచ్చి
పట్టెడుగూటికై బతిమాలి

పుట్టినచోటికే పొరలి మనసు పెట్టి

వట్టిలంపటము వదలనేరడుగాన

అందరిలో బుట్టి అందరిలో బెరిగి

అందరి రూపము లటుదానై

అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించి

అందరానిపదమందెనటుగాన

చుట్టెడు కడుపుకై ఎన్ని కపటపు పనులు చేస్తున్నాము? అవి ఎందుకు?

43.పుట్టుభోగులము మేము"

ప|| పుట్టుభోగులము నేము భువి హరిదాసులము | నట్టనడిమి దొరలు నాకీయవలెనా ||

చ|| పల్లకీలు నందనాలు పడివాగె తేజీలు |

వెల్లివిరి మహాలక్ష్మి విలాసములు |

తల్లియాకె మగనినే దైవమని కొలిచేము |

వొల్లగే మాకే సిరులు వొరులీయవలెనా ||

చ||గ్రామములురత్నములు గజముఖ్య వస్తువులు |

ఆమని భూకాంతకు నంగభేదాలు ||

భామిని యాకె మగని ప్రాణధారి లెంకలము |

వోమి మాకాతడే యిచ్చీ వొరులీయవలెనా ||

చ||పసగల పదవులు బ్రహ్మ నిర్మితములు |

వెస బ్రహ్మ తండ్రి శ్రీ వేంకటేశుడు |

యెసగి యాతడే మమ్మునేలి యిన్నియు నిచ్చె |

వొసగిన మానొమ్ములు వొరులీయవలెనా ||

వాడిని వీడిని ప్రాధేయ పడవలసిన అవసరం లేదు! మా అమ్మ మహాలక్ష్మి మా తండ్రి నారాయణుడు! అని నిశ్చింతగా బ్రతకవచ్చు భక్తుడు!

44.ఛీ ఛీ నరులదేటి జీవనము అంటారు! బ్రతిమాలాడుతూ దీనముగా బ్రతికేకంటే ధీరంగా భక్తుడిలా బ్రతకాలి!

ఛీ ఛీ నరులదేటి జీవనము కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక

చ||అడవిలో మృగజాతియైన గావచ్చుగాక వడినితరుల గొలువంగ వచ్చునా
వుడివోని పక్షియైవుండనైనవచ్చుగాక విడువకెవ్వరినైనా వేడవచ్చునా
చ||పసురమై వెదలేని పాటుపడవచ్చుగాక కసివో నొరుల బొగడగావచ్చునా
వుసురుమానై పుట్టి వుండనైనవచ్చుగాక విసువక వీరివారి వేసరించవచ్చునా

చ||యెమ్మెల బుణ్యాలుసేసి యిల యేలవచ్చుగాక కమ్మి హరిదాసుడు గావచ్చునా
నెమ్మది శ్రీ వేంకటేశ నీ చిత్తమేకాక దొమ్ముల కర్మములివి తోయవచ్చునా

45. కడుపెంత తా కుడుచు కుడుపెంత" (మైత్రి, ముదిత, కరుణ, ఉపేక్ష చూపిస్తున్నారు)

ప|| కడుపెంత తాగుడుచు కుడుపెంత దీనికై | పడని పాట్లనెల్ల పడి పొరల నేలా ||

చ|| పరులమనసునకు నాపదలు గలుగగ జేయ | పరితాపకరమైన బ్రతుకేలా |

నొరిదినితరుల మేలు చూచి సైపగలేక | తిరుగుచుండేటి కష్టదేహమిది యేలా ||

చ|| యెదిరికెప్పుడు జేము హితమెల్ల దనదనుచు | చదివిచెప్పని యట్టి చదువులెలా |

పొదిగొన్న యాసలో బుంగుడై సతతంబు | సదమదంబై పడయు చవులు దనకేలా ||

చ|| శ్రీ వేంకటేశ్వరుని సేవానిరతి గాక | జీవన భ్రాంతి బడు సిరులెలా |

దేవోత్తముని నాత్మదెలియ నొల్లక పెక్కు | త్రోవలేగిన దేహి దొరతనంబేలా ||

- కడుపు నింపుకుని తగిన కోరికలతో ధర్మం పాటిస్తూ జీవిస్తే ఎంతో హాయి! ఇతరుల మనస్సులకు ఆపదలు కలుగచేసే బ్రతుకు ఎందుకు? ఇతరుల మేలు చూసి సహించలేని బ్రతుకు ఎందుకు? పదిమందికి పనికి వచ్చేటట్లు బ్రతకడం అనే సంస్కారం చెప్పనప్పుడు ఆ చదువు ఎందుకు? ఎప్పుడూ ఏదో ఒక ఆశలో మునిగిపోతూ ఉండే స్థితి ఎందుకు?
- ***ఆఖరిమాటలో పరమార్థం చెప్తున్నారు - శరీరం ఉన్నపుడే ఇందులో ఆత్మగా ఉన్న పరమాత్మని గ్రహించక అనేకరకాలుగా తిరిగే దేహి యొక్క గొప్పతనం ఎందుకయ్యా?***
- ***జీవనసాఫల్యం ఏమిటి? - మనలోని పరమాత్మని తెలుసుకోవడము!***

46. మహిని ఉద్యోగి కావలె మనుజుడైనవాడు

మహినుద్యోగి కావలె మనుజుడైన వాడు

సహజి వలె నుండి ఏమి సాధించలెడు.

వెదకి తలచుకుంటే విష్ణుడు కానవచ్చు
చెదరి మరచితే సృష్టి చీకటౌ
పొదలి నడిచితేను భూమెల్లా మెట్టి రావచ్చు
నిదిరించితే కాలము నిమిషమై తోచు

వేడుకతో చదివితే వేదశాస్త్ర సంపన్నుడౌ
జాడతో నూరకుండితే జడుడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుడౌ
కూడక సోమరి ఐతే గుణహీనుడౌను

మురహరు గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెరగక ఉండితే వీరిడియౌను
శరణంటే శ్రీవేంకటేశ్వరుడు రక్షించును
పరగ సంశయించితే పాషండుడౌను

- మానవుడు ఎప్పుడూ ప్రయత్నశీలిగా ఉండాలి! దాన్ని ఉద్యోగం అంటారు! సాధన చేయాలి! భగవంతుడు దొరకాలి అన్నా కూడా సాధన చేయాలి, ప్రయత్నం చేయాలి!
- సహజి అయి ఉంటే సాధించలేడు! అంటున్నారు! ఏది ప్రారబ్ధం అయితే అది వస్తుంది అని ఉరుకోకూడదు! రాసిపెట్టి ఉంటే వస్తుంది అని కూర్చుకోకూడదు! అన్నం వడ్డించిన ప్రయత్నంతో తింటావుగా!
- వెదకి తలచుకుంటే విష్ణువు కానవచ్చు - అన్వేషాత్మక దృష్టితో, సాధనా దృష్టితో నిరంతరం సాధన, చింతన, ధ్యానం చేస్తే విష్ణువు కానవచ్చు! ఆ ప్రయత్నం చేయకపోతే సృష్టి చీకటిగా ఉంటుంది!
- ముందు నడిస్తే భూమి అంతా తిరగవచ్చు, నిద్రపోతు ఉంటే కాలాలు కరిగిపోతాయి!
- ప్రయత్నములు ఎప్పుడూ ఉండాలి! సోమరిగా బ్రతకరాదు! నిరంతరం ప్రయత్నశీలురం అవ్వాలి! ఇంకా ఒక రోజు ఆయువు ఉందంటే భగవంతుడు ఇంకో రోజు ఆయువు ఇచ్చాడు అని! దాన్ని ఉపయోగించుకోవాలి!
- కదలకుండా కూర్చుంటే గరుత్మంతుడు ఒక అడుగు వేయలేడు, కదిలే ప్రయత్నం వల్ల చీమలబార్లు యోజనాలు దాటుతున్నాయి అంటదు సుభాషితకారుడు. ప్రయత్నమే బలము, బలము వల్ల ప్రయత్నిస్తాము అని కాదు!

- తాను కష్టపడి శాస్త్రాలు అధ్యయనం చేస్తే జ్ఞానం వస్తుంది, ఊరికే కూర్చుంటే జడుడు అవుతాడు! ఓడక అంటే పరాజితుడు కాకుండా తపస్సు ఆచరిస్తే ఉన్నతోన్నతుడు అవుతాడు, సోమరిగా ఉంటే గుణహీనుడు అవుతాడు!
- బ్రతుకులో క్షణం వ్యర్థం చేయకుండా నారాయణుడిని కొలుచుకుంటే మోక్షం సాధించవచ్చు అది తెలియకపోతే వ్యర్థుడు అవుతాడు!
- ***నిస్సందేహంగా శరణు అంటే స్వామి తప్పక రక్షిస్తాడు, సంధేహిస్తూ ఉంటే పాషండుడు అయి ధర్మభ్రష్టుడు అవుతాడు!***

47. భక్తికొలది వాడే పరమాత్ముడు"-భక్తి కొద్దీ భగవంతుడు

భక్తికొలది వాడే పరమాత్ముడు
భుక్తిముక్తి తానెయిచ్చు భువి పరమాత్ముడు

పట్టినవారిచే బిడ్డ పరమాత్ముడు
బట్టబయటి ధనము పరమాత్ముడు
పట్టపగటి వెలుగు పరమాత్ముడు
యెట్టనెదుటనే వున్నాడిదె పరమాత్ముడు

పచ్చిపాలలోనివెన్న పరమాత్ముడు
బచ్చనవాసినరూపు పరమాత్ముడు
బచ్చుచేతివొరగల్లు పరమాత్ముడు
యిచ్చుకొలదివాడువో యీ పరమాత్ముడు

పలుకులలోనితేట పరమాత్ముడు
ఫలియించునిందరికి పరమాత్ముడు
బలిమిశ్రీ వేంకటాద్రి పరమాత్ముడు
యెలమి జీవులప్రాణమీ పరమాత్ముడు

- పట్టినవారి చేబిడ్డ పరమాత్ముడు - అంత చేరిక అవుతాడు
- బచ్చెనవాసిన రూపు - ఏ పూతా లేని వాడు

- గీటురాయి వంటివాడు పరమాత్మ - ఎవరికీ తగ్గట్లు వారికి ఇస్తాడు!
- పలుకులలోని తేట పరమాత్మ - శాస్త్ర సారము
- భగవంతుడు అందరికి దొరుకుతాడుట

48.సడి బెట్టె కటకటా సంసారము" - సంసారము గురించి వర్ణించే కీర్తన

ప|| సడిబెట్టె గటకటా సంసారము చూడ | జలధిలోపలియీత సంసారము ||

చ|| జమునోరిలో బ్రదుకు సంసారము చూడ | చమురుదీసినదివ్వె సంసారము |

సమయించుబెనుదెవులు సంసారము చూడ | సమరంబులో నునికి సంసారము ||

చ|| సందిగట్టినతాడు సంసారము చూడ | సందికంతలతోవ సంసారము |

చందురునిజీవనము సంసారము చూడ | చంద మేవలెనుండు సంసారము ||

చ|| చలువలోపలివేడి సంసారము చూడ | జలపూతబంగారు సంసారము |

యిలలోన దిరువేంకటేశ నీదాసులకు | చలువలకు గడుచలువ సంసారము ||

- నూనె తీసేసిన దీపం లాంటిది సంసారం
- జమునోరిలో ఉండడం లాంటిది అంటే యముడినోటిలో ఉన్నట్లు - అశాశ్వతం అని చెప్పడం
- యుద్ధంలో కాపురం పెట్టడం లాంటిది
- సమయించు పెనుతెములు సంసారం - నశింపచేసే పెద్దరోగము
- ***దీనికి మందు వేంకటేశ్వరుడు!***

49.ఏదాయెనేమి హరి ఇచ్చిన

ప : ఏదాయనేమి హరి ఇచ్చిన జన్మమే చాలు

ఆదినారాయణుడే అఖిల రక్షకుండు

చ : శునకము బతుకును సుఖమయ్యే తోచుకాని

తనకది హీనమని తలచుకోదు

మనసొడబడితేను మంచిదేమి కానిదేమి

తనువులో అంతరాత్మ దైవమగుట తప్పదు

చ : పుణువుకుండే నెలవు భువనేశ్వరమైతోచు

పెరచోటి గుంటయైన ప్రియమైయుండు

ఇరవై వుండితే చాలు ఎగువేమి దిగువేమి

వరుస లోకములు సర్వం విష్ణుమయము

చ : అచ్చమైన జ్ఞానికి అంతా వైకుంఠమే

చెచ్చర తనతిమ్మటే జీవన్ముక్తి

కచ్చుపెట్టి శ్రీవేంకటపతికీ దాసుడైతే

హెచ్చుకుందేమిలేదు ఏలినవాడితడే

- స్పష్టిలో ఏ ఉపాధిలో ఉన్న జీవుడికి ఆ ఉపాధి గొప్పది! భగవంతుడు బ్రతుకు తీపి అందరికీ ఒకేలా పెట్టాడు" ఉన్న స్థితిని ఉన్నత స్థితిని చేసుకోవాలి! ***ఏది లభించిందో దానినే సాధనకి ఉపయోగించుకోవాలి!***
- కుక్క కూడా తన బ్రతుకు కూడా గొప్పది అనే అనుకుంటుంది! ఇది ప్రతీవాడికి ఉంటుంది! మనస్సు అంగీకరిస్తే మంచి, చెడు ఎన్ని ఏమున్నది/
- పురుగుకు తను ఉండేచోటే భువనం! వరుస లోకములు సర్వమూ విష్ణుమయం! ఏ శరీరం అయినా అంతరాత్మ విష్ణువే అని తెలుసుకోవాలి
- ***అచ్చమైన జ్ఞానికి అంతా వైకుంఠమే! ఆయన స్పృహలో ఉంటే వైకుంఠంలో ఉన్నట్లే! స్వచ్ఛమైన బ్రహ్మజ్ఞానం కలిగినవాడికి, విష్ణుభక్తి కలిగినవాడికి అంతా వైకుంఠమే! అది తెలిసి ఆత్మకి అభిన్నమైన పరమాత్మని ఎవడు అనుభవిస్తున్నాడో వాడికి తృప్తి!***

50.తందనానా భళా తందనానా"

ప|| తందనాన ఆహి తందనాన పురె |

తందనాన భళా తందనాన ||

చ|| బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే |

పరబ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే ||

51. నాటికి నాడే నాచదువు

ప|| నాటికి నాడే నాచదువు | మాటలాడుచును మరచేటిచదువు ||

చ|| ఎనయ నీతని నెరుగుటకే పో | వెనకవారు చదివినచదువు |

మనసున నీతిని మరచుటకే పో | పనివడి యిప్పటి ప్రౌఢలచదువు ||

చ|| తెలిసి యితనినే తెలియుటకే పో | తొలుత గృతయుగాదుల చదువు |

కలిగియీతని గాదననే పో | కలియుగంబులో గలిగిన చదువు ||

చ|| పరమై వేంకటపతి గనుటకే పో | దొరలగు బ్రహ్మాదుల చదువు |
సిరుల నితని మరచెడికొరకే పో | విరసపుజీవుల విద్యలచదువు ||

- చదువు ఏదయ్యా అంటే పరమాత్మని చెప్పే చదువు! భగవంతుని తెలుసుకోవడానికి చదివారు, కానీ ఇప్పుడు భగవంతుని మర్చిపోయేలా చదువుతున్నారు! ఇదే చదువు అనుకుని పడి బ్రతుకు నాశనం చేసుకుంటున్నారు ఇప్పుడు!
- కృతయుగాదుల చదువు - పరమాత్మని తెలుసుకోవటానికి!
- కలియుగపు చదువులు - ఉన్నవాడిని వద్దు అనేటట్లు ఉన్నాయి

***చదువు అంటే ఏమిటి?***
***చదువు అంటే పరమాత్మ జ్ఞానం మనకి అందించాలి, మన ఆలోచనలని భగవంతుని పొందడానికి అనుగుణంగా తీర్చిదిద్దాలి, మనలో ఉత్కృష్టమైన భావజాలాన్ని, చక్కని జీవన విధానాన్ని ఏర్పరిచి, భగవదభిముఖంగా ప్రయాణింప చేసి, భగవంతుడితో ఐక్యం ఘటించాలి! అది చదువు!***

అన్నమాచార్యుల వారు ఆనాడే అద్భుత బాండారం అని ఉన్నది, అక్కడ భద్రపరచారు! తర్వాత తర్వాత కొన్ని పోవడం, కొన్ని ఉద్ధరింపబడడం! ఇలా చాలా మంది సేవ చేసారు భద్రపరచి, వ్యాప్తి చేసినవారు ఉన్నారు!

52. దాచుకో నీ పాదాలకు తగనే చేసిన పూజలివి
   దాచుకో నీపాదాలకుదగ నే జేసినపూజ లివి
   పూచి నీకీరీతిరూపపుష్పము లివి యయ్యా

   వొక్క సంకీర్తనె చాలు వొద్దికై మమ్ము రక్షించగ
   తక్కినవి భాండారాన దాచి వుండనీ
   వెక్కసమగునీ నామము వెల సులభము ఫల మధికము
   దిక్కై నన్నేలితి విక నవి తీరని నా ధనమయ్యా

   నానాలికపైనుండి నానాసంకీర్తనలు
   పూని నాచే నిన్ను బొగడించితివి

వేనామాల వెన్నుడా వినుతించ నెంతవాడ
కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేయయ్యా

యీమాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితిగాని
చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాడగాను
నేమాన బాడేవాడను నేరము లెంచకుమీ
శ్రీమాధవా నే నీదాసుడ శ్రీవేంకటేశుడవయ్యా

స్వామి యొక్క వైభవాన్ని కీర్తించిన పువ్వులు నా కీర్తనలు
నా బుద్ధికి తగినట్లు చేసుకున్నాను స్వామి

"నా నాలుకపై నుండి నానా సంకీర్తనలు పూని నాచే పొగడించితివి"

కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేయయ్యా, యీమాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితిగాని

ఈ మాట గర్వము కాదు స్వామి నీ మహిమనే చెప్తున్నాను

నేమాన బాడేవాడను నేరము లెంచకుమీ- ఒక నియమంగా పాడుకున్నాను స్వామి! నా నిర్వాకమా

53. తెలిసితె మోక్షము తెలియకున్న బంధము
తెలిసితేమోక్షము తెలియకున్న బంధము
కలవంటిది బతుకు ఘనునికిని

అనయము సుఖమేడది అవల దు:ఖమేడది
తనువుపై ఆశలేనితత్వమతికి
పొనిగితే పాపమేది పుణ్యమేది కర్మమందు
వొనర ఫలమునొల్లన యోగికిని

తగిన అమృతమేది తలపగ విషమేది

తెగి నిరాహారి యైన ధీరునికిని

పగవారనగ వేరె బంధులనగ వేరె

వెగటు ప్రపంచమెల్ల విడిచే వివేకికి

వేవేలు విధులందు వెఱపేది మఱపేది

దైవము నమ్మినయట్టి ధన్యునికిని

శ్రీవేంకటేశ్వరుడు చిత్తములో నున్నవాడు

యీవలేది యావలేది యితనిదాసునికి

- సత్యము అక్కడే ఉంది, తెలుసుకుంటే మోక్షము!
- ప్రపంచము కలవంటిది! నశించని వస్తువు ఉంది అది నీలో నీ గా ఉన్నది అది తెలుసుకో!

***తాత్వికత, నైతికత, భక్తి, దేవతాదర్శనం, సంగీతం, నృత్యం ఎన్నో కోణాలు రచించారు! ఆయన యోగపు చదువులు ఆయన కీర్తనల ద్వారా తెలుసుకున్నాము!***

# సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు